## వరి బీజమా, వెరికోసీలా?

**నేను ఇండియన్ ఆర్మీలో జాబ్ చేస్తున్నాను. నాకు మొదటి నుంచి ఒక ప్రాబ్లమ్ ఉంది. అది నేను ఆర్మీకి సెలక్ట్ అయ్యేటప్పుడు కూడా ఉండేది. మెడికల్ టెస్ట్‌లో డాక్టర్‌గారు నన్ను, నా బీర్జాలను పరీక్షించారు. కాని ఏ రిపోర్టు వ్రాయలేదు. దేవుడి దయ వలన నేను సెలక్ట్ అయ్యాను. సార్! నా బీర్జాలు క్రిందకు సాగి ఉంటాయి. ఒకటి చిన్నది. ఒకటి పెద్దది ఉంటుంది (మరీ అంత పెద్దదిగా కాదు). కాని చలి ప్రదేశములలో రెండు బిగుసుకొని చిన్న సంచిలాగా ఉంటాయి. ఇది గత మూడు సంవత్సరములనుంచి వుంది. నేను మా ఫ్రెండ్‌కి చూపిస్తే నాకు 'వెరికోసీల్' ఉంది అని, వీర్య కణములు చనిపోయి పిల్లలు కలగరు అని చెప్పాడు. నా వయస్సు 21 సం॥రములు. ఇంకా పెళ్ళి చేసుకోలేదు. వాడు చెప్పిన దగ్గరనుంచి చాలా భయముగా ఉంది. నా సమస్యకు పరిష్కారము వ్రాయండి. నాకు తల్లిదండ్రులెవరూ లేరు. నాకు చనిపోవాలని ఉంది.**

**- 56 APO**

జ. రెండు సంగతులు అర్థం చేసుకోండి. మీకు బీర్జాలలో దోషాలుంటే మీరు మిలటరీకి సెలక్టయి ఉండేవారు కాదు. మిలటరీ ఆ విషయంలో చాలా స్ట్రిక్టుగా ఉంటుంది. కాబట్టి బీర్జాల గురించి ఈ రూపేణా మీరు భయపడక్కర్లేదు.

బీజాలు రెండిటిలో ఒకటి కొద్దిగా పెద్దది గాను, ఒకటి కొంచెం చిన్నది గానూ ఉండటం మామూలే. అలాగే ఒకటి కిందికీ, ఒకటి మీదకీ ఉండటం... చలిగా ఉన్నప్పుడు రెండూ బిగుసుకుని చిన్న బంతిలా దగ్గరకు ముడుచుకు పోవడమూ సహజమే. అవి ప్రకృతి ధర్మాలే తప్ప దోషాలు కావు (మా 'జననాంగ విజ్ఞానం' చదివితే మీకిలాటి విషయాలు అర్థమై అనుమానాలు పోతాయి). ఆ సంగతి తెలీక మీరు అనవసరంగా ఆందోళన పడిపోతున్నారు.

ఇక రెండో సంగతి: *మీ ఫ్రెండు ఫ్రెండే కాని డాక్టరు కాదు.* మామూలు డాక్టర్లే ఒకోసారి వెరికోసీల్‌ని గుర్తించలేరు, ఇక మిగతా వాళ్ళెలా గుర్తించగలరు? వైద్య సమస్యల గురించి డాక్టర్నే సంప్రదించాలి తప్ప ఫ్రెండ్స్‌ని కాదు. సలహా అడిగితే డయాగ్నోసిస్ చెప్పేసే ఫ్రెండ్‌ని అసలే నమ్మొద్దు. మీ అనుమానం తీర్చుకోవడానికి యూరాలజిస్టుని కాని, సర్జన్‌ని కాని సంప్రదించండి.

## సమస్యలు - సందేహాలు

**★ ఆడవారికి క్రమం తప్పకుండా బహిష్టులవుతున్నా వారికి యోని ద్రవాలు ఊరక, రతి బాధాకరంగా ఉండటానికి కారణమేమిటి?**

**★ నాకు అంగం దానంతట అది స్తంభించదు. అంగాన్ని లోపలకు తోసిన తరువాత 80 శాతం గట్టిపడుతుంది. నా వయసు 45 సం॥లు.**

**★ కొందరాడవాళ్ళకి 50-60 సం॥ల వయసు వచ్చినా రొమ్ముల సైజు తగ్గదు. కొందరికి బహిష్టులు అవుతున్నా రొమ్ములు క్షీణించి పోతాయి.**

**వీటన్నిటికీ కారణాలు తెలియజేయ గలరు.**

జ. 1) ఆడవారికి 40-15 సం॥లు దాటే సరికి కొద్దికొద్దిగా వారి శరీరంలో ఎస్ట్రోజెన్ ఉత్పత్తి తగ్గుముఖం పడుతూంటుంది. దాంతో యోని లోపలి గోడలలో మార్పులొచ్చి, యోని ద్రవాలు తగ్గి, రతి బాధాకరమవుతుంది.

రతి పట్ల కోరిక లేకుండా భర్తను సంతోషపెట్టడం కోసమే రతిలో పాల్గొన్నా, కోరిక ఉన్నప్పటికీ రతిలో ఉద్రేక పడలేకపోతున్నా యోని స్రావాలు సరిగా ఉత్పత్తి కావు. స్త్రీ పూర్తిగా ఉద్రిక్తురాలు కాకుండానే భర్త రతికి ఉపక్రమించినా యిలాగే జరుగుతుంది. ఇవి కూడా రతి మంటకు దారి తీస్తాయి.

కొంతమంది స్త్రీలు దీర్ఘ అనారోగ్యాల నిమిత్తం (ఉదా: హై బి.పి., మానసిక ఆందోళన, విచారం మొ॥ వాటికి) మందులు వాడుతూంటారు. వాటి ప్రభావం వల్ల కూడా యోనిస్రావాలు ఉత్పత్తి మందగిస్తుంది.

రతి మంటకు జననాంగ వ్యాధులు ఒక కారణం. అలాగే బీజవాహిక లోపలి ప్రాంతంలోను, లోపలి అవయవాలకు సంబంధించి, పొత్తి కడుపులోని అవయవాలకూ దోషాలు కాని, వ్యాధులు కాని ఉండటం కూడా రతిమంటకు కారణమవుతాయి.

కనుక రతి బాధాకరంగా ఉంటే డాక్టరుకి చూపించుకుని, వ్యాధులూ, దోషాలూ ఏవైనా ఉంటే చికిత్స చేయించుకోవాలి. అవేం లేకపోతే లైంగిక చికిత్స (సెక్స్ థెరపీ), కౌన్సిలింగు సరిపోతాయి.

2) మీకు 45 సం॥లన్నారు కదా. ఈ వయసులో చాలామందికి అంగాన్ని డైరక్టగా చేత్తో ప్రేరేపిస్తే తప్ప దృఢంగా స్తంభించదు. కొన్ని మందుల వాడకం వల్ల కూడా అంగ స్పందనలు లేటవుతాయి. ప్రణయకళ స్త్రీలకి ఎలా అవసరమో, పురుషులకీ అలాగే అవసరం. ప్రణయకళకి బాగా ప్రాధాన్యత నివ్వండి. ముఖ్యంగా మీ భార్య మిమ్మల్ని చక్కగా ఉద్రేక పరచాలి.

3) రొమ్ముల బిగి వాటిలోని కొవ్వుపై ఆధారపడుతుంది. స్త్రీ హార్మోను 'ఎస్ట్రోజెన్' ఉత్పత్తిపై ఆధారపడుతుంది. ఆ రెండూ తగినంత ఉన్నంత వరకూ రొమ్ములు వేలాడిపోకుండా ఉంటాయి.

## తగాదా

**నేను 3 సం॥ల నుండి కువైట్‌లో ఉంటున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. ఇండియాలో మా ఇంట్లో అమ్మ, నాయన, భార్య, పిల్లలు ఉన్నారు. నా భార్య, మా అమ్మ నాయన గొడవలు పడుతున్నారు. నా బాధ ఏమిటంటే నా కుటుంబము గొడవ నలుగురికి తెలిస్తే నలుగురిలో నేను తిరగలేను. నా కుటుంబ పరిస్థితి వలన ఇపుడు నాకు మనశ్శాంతి లేదు. నేను కువైట్‌కు రాకముందు చాలా బీదవాళ్ళం. దేవుడి దయ వలన కొద్దిగా సంపాదించుకున్నాను. నా కుటుంబంలోని కలహాల వల్ల నాకు బ్రతుకు మీద విరక్తి కలుగుతున్నది. అసలు సంసారంలో గొడవలు ఎందుకు వస్తాయి?**

**-జి.ఎస్.ఎన్., కువైట్**

జ. 'అత్త కొట్టినందుకు కాదు గాని ఆడపడుచు నవ్వినందుకు ఏడుపొచ్చిందన్న' మాదిరిగా మీ విచారం మీ వాళ్ళు తగాదా పడుతున్నందుకు గాక, నలుగురికి తెలిసి పోతుందన్న భయానికి కావడం విచారకరం. మీ యింట్లో మీ భార్య, మీ తల్లిదండ్రులు తగాదాలు పడుతున్న సంగతి వాస్తవమన్నప్పుడు- అది ఎలాగో అలాగ యితరులకు తెలిసి పోతుంది. ఆ మాటకొస్తే- మీకంటే కూడా ముందు పొరుగు వాళ్ళకే తెలుస్తుంది. తెలిసేక వాళ్ళు ఖచ్చితంగా ఏదో ఒకటి అనుకుంటారు, అంటారు. ఇక వాటి గురించి ఆలోచించ కూడదు. మీ ధ్యేయమల్లా మీ వాళ్ళు తగాదా పడకుండా చూడటమే.

ఏ మనిషి అభిప్రాయాలూ, పూర్తిగా మరో మనిషి అభిప్రాయాల్లా ఉండవు కదా! ప్రతి యింట్లోనూ, అభిప్రాయ భేదాలు, చిన్నవో పెద్దవో తగాదాలూ తప్పవు. ఆ సంగతి గ్రహించి ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించడం నేర్చుకోవాలి. విభేదం కాని, తగాదా కాని ఏర్పడే సందర్భాలు రాకుండా జాగ్రత్త

పడాలి. వస్తే వాటిని పెద్దవి కాకుండా చూసు కోవాలి. రెచ్చగొట్టే మాటలు అనడం, అధికారం ప్రదర్శించటం, మాటని లెక్కచెయ్యకుండా ఉండటం ఇటు అత్త మామలకీ పనికిరాదు, అటు కోడలికీ పనికిరాదు. సర్దుబాటు తత్వం యిద్దరిలోనూ ఉండాలి. ఇవేవీ లేనప్పుడే తగాదాలు ఏర్పడతాయి.

మీరు ఉత్తరాలలోనూ, వ్యక్తిగతంగానూ మీ వాళ్ళందరికీ సర్ది చెప్పండి. తగాదా ధోరణి విడిచిపెట్టకపోతే పర్యవసానాలు బాధాకరంగా ఉంటాయని చెప్పండి. ఒకసారి వాళ్ళని ఫేమిలీ కౌన్సిలర్స్ దగ్గరకి తీసుకువెళ్ళి తగాదాలు రాకుండా సామరస్యంగా ఎలా ఉండాలో కౌన్సిలింగ్ యిప్పించండి.

అయినా మారకపోతే యిద్దర్నీ వేరు చేసెయ్యండి తప్ప మధ్యలో మీరు విరక్తి చెందడం, మనశ్శాంతి కోల్పోవడం సరికాదు.

## సంతానం కలగలేదు

**మాకు సంతానం లేనందున మిమ్మల్ని సంప్రదిస్తే మీరు మా రిపోర్టులు పరిశీలించి, నా భార్యకు కొన్ని పరీక్షలు చేయించమని చెప్పారు. ఆ పరీక్షల రిపోర్టులు జతపరుస్తున్నాను. మాకు సంతానం అయ్యే విధంగా సలహాలిమ్మని కోరుతున్నాను.**

**-ఆర్.వి.**

జ. మీ వీర్యంలో వీర్య కణాల సంఖ్య, కదలిక, స్వరూపం, ఇతర సెమినల్ పేరామీటర్లు అన్నీ బావున్నాయి. యాంటీ బాడీలున్న ఆధారాలు కూడా ఏమీ లేవు.

మీ శ్రీమతికి సంబంధించి హార్మోను పరీక్షలు, ఫాలిక్యులర్ స్టడీ (అండోత్పత్తి గురించిన స్కానింగ్ పరీక్ష), మొ॥వన్నీ బావున్నాయి. అయితే అండవాహికలు ద్రవంతో ఉబ్బి పెద్దవైన (hydrosalpinx) లక్షణాలు కనబడుతున్నవనీ, గర్భాశయం ఫ్రీగా కదలడం లేదనీ స్కాన్ పరీక్ష, యోని పరీక్షలలో రిపోర్టు వ్రాసారు. ఋతుచక్రంలో ఉన్న కడుపునొప్పి లక్షణాలు, మరికొన్ని లక్షణాలు బట్టి ఎండోమెట్రియోసిస్‌ని లేదా పెల్విక్ ఎడ్హెషన్స్‌ని అనుమానించవలసి వస్తోంది. కనుక మీరు ముందుగా ఆమెకు లేప్రోస్కోపీ పరీక్ష చేయించడం మంచిది. ఇన్ఫెర్టిలిటీ సెంటర్స్‌లో సంప్రదించండి. లేప్రోస్కోపీలో ట్యూబుల స్థితిని కూడా గమనించి, వాటన్నిటికీ తగు చికిత్స చేయడం జరుగుతుంది. ట్యూబ్స్‌కి ఎక్కువగా నష్టం వాటిల్లక పోతే తదుపరి వైద్యంతో సంతానం కలుగుతుంది.

## బీజం వాపు

**అభిసారికలో బీజం వాపు సమస్య గురించిన వ్యాసం చదివి నాకూ ఆ సమస్య ఉండటంతో వెంటనే డాక్టర్ని కలిసి వైద్యం చేయించుచున్నాను. వాపు, నొప్పి 90% తగ్గిపోయినవి. 'అభిసారిక'కు నా ధన్యవాదాలు. ఆ డాక్టరుగారు నన్ను పరీక్షించినప్పుడు నాకు వరిబీజంతోపాటు వెరికోసీల్ కూడా ఉందని చెప్పారు. బీజాల స్కానింగ్‌లో కూడా అదే విధంగా రిపోర్టు వచ్చింది. నా సెమెన్‌లో కౌంటు కూడా తక్కువగా ఉంది కనుక డాక్టరుగారు వెరికోసీల్‌కి ఆపరేషన్ చేయించుకోమన్నారు. అయితే ఇంతకు నెల్లాళ్ళ ముందు చేసిన స్కానింగ్‌లో వెరికోసీల్ లేదు. యిప్పుడెలా వచ్చిందని అడిగితే అప్పుడు బీజం వాపు ఉన్నందువల్ల బయట పడి ఉండకపోవచ్చు అన్నారు. వెరికోసీల్‌కి ఆపరేషన్ చేయించుకోకపోతే వీర్యకణాలు కొన్నాళ్ళకి మొత్తం పోవచ్చు అన్నారు. నాకు 4-5 నెలల వరకూ ఆపరేషన్ చేయించు కునే అవకాశం లేదు. నేను తప్పనిసరిగా ఆపరేషన్ చేయించు కోవాలా? 5 నెలల తర్వాత చేయించుకుంటే అప్పటికే వీర్య కణాలు పోతే ఎలా? వెరికోసీల్ ఎందుకు వస్తుంది. మీ అమూల్య సలహాలు తెలియజేయండి.**

**- 99 APO**

జ. అభిసారికలోని వ్యాసాల కారణంగా మీ సమస్యని మీరు గుర్తించి పరిష్కరించుకుంటున్నందుకు చాలా సంతోషం.

మీరు పంపిన రిపోర్టులు పరిశీలించాను. వీర్యకణాల కౌంటు, చలన శక్తి, నాణ్యత తక్కువగా ఉన్న మాట వాస్తవమే. అయితే మీరు పంపినది ఒకే ఒక్క వీర్య పరీక్ష రిపోర్టు. అందులో కూడా వీర్యం అర మిల్లీ లీటరు మాత్రమే వచ్చినట్టు రాసి ఉంది. పరీక్ష కోసం వీర్యం తీసేటప్పుడు కొంత వీర్యం పోయినా, అంతకు 24-36 గంటల ముందు స్ఖలనం జరిగి ఉన్నా... ఈ రిపోర్టు మీద ఆధారపడకూడదు. 3 రోజుల పాటు స్ఖలించకుండా ఉండి మరోసారి వీర్య పరీక్ష చేయించండి. 10 రోజుల తర్వాత మరల అదే విధంగా 3 రోజులాగి వీర్య పరీక్ష చేయించండి. మరో 10 రోజులకి మరల చేయించండి. ఈ 3 పరీక్షల సగటుని బట్టి మీ వీర్యం నాణ్యతపై నిర్ణయం తీసుకోవాలి.

ఇక వెరికోసీల్ ఉనికి మొదటి స్కానింగ్ పరీక్షలో బయట పడక పోవడానికి మీ డాక్టరుగారు చెప్పినదొక కారణమైతే మరో కారణం పరీక్ష చేయించిన 'సమయం' కావచ్చు. ఉదయం పూట చేసే స్కాన్స్‌లో వెరికోసీల్స్ దొరకకపోవచ్చు. సాయంత్రానికవి స్పష్టంగా ఏర్పడతాయి. స్కాన్‌ని చేసిన డాక్టరు వెరికోసీల్ దృష్టితో కాక వాపుని దృష్టిలో ఉంచుకుని స్కాన్ చేస్తే వెరికోసీల్ విషయం బయట పడదు. వెరికోసీల్‌ని గుర్తించాలంటే వాల్‌సాల్వా మేనొవర్ చేయించి స్కాన్ తియ్యాలి. స్కాన్ కంటే డాప్లర్ పరీక్ష మరీ మంచిది.

ఇన్నిటిని దృష్టిలో ఉంచుకుంటే మరల మీరు యూరాలజిస్టుకి చూపించుకోవడం మంచిది. ఆయన కూడా ఆపరేషన్ తప్పనిసరి అంటే చేయించేసుకోండి. వెరికోసీల్‌కి మరో చికిత్స లేదు.

5 నెలల దాకా సర్జరీ వీలు పడదంటున్నారు. వాయిదా అంత తప్పనిసరి అయితే రోజూ రాత్రి బీజాలకింద చల్లటి నీరున్న ఫోమెంటేషన్ బ్యాగుని ఉంచుకుని పడుకోండి. ఈ బ్యాగులు మెడికల్ షాపుల్లో అమ్ముతారు.

## రతిపట్ల ఆసక్తి చూపదు!

**నేను, నా భార్య ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం. 38 సం॥ల సుదీర్ఘ కాపురం మాది. యిద్దరం చాలా అన్యోన్యంగా ఉంటాము. మా యిద్దరి వయసులూ ఒకటే - 58 సం॥లు.**

**నా భార్యకి అంత వయసు కనబడదు. చాలా యంగ్‌గా ఉంటుంది. ఇప్పటి తరం యువతుల్లా మంచి ఫిగరు మెయింటెన్ చేస్తుంది. హెల్తుకూడా బావుంటుంది. అయితే నా దురదృష్టం కొద్దీ మా వైవాహిక జీవితం మొత్తం కాలంలో నా భార్య ఎప్పుడూ తనంత తాను రతిని కోరలేదు. ఎప్పుడూ నేను కోరితేనే జరుగుతుంది. అంతే కాదు. ఆ సమయంలో బట్టలు పూర్తిగా విప్పదు. అందరూ పాటించే మామూలు పద్ధతే తప్ప మరే భంగిమలోనూ రతికి ఒప్పుకోదు. అలాంటివి ఏం కోరినా చిరాకు పడుతుంది. ఆ రోజుకి ఇక సెక్సు ఉండక పోవచ్చు కూడా! అందుకని చేసేది లేక నేను సరిపెట్టుకుంటూ ఉంటాను. సెక్సులో కూడా ఉత్సాహంగా పాల్గొనదు. రతిని కోరడం దగ్గర్నుంచి ముగించే దాకా అంతా నేను చేసుకోవలసిందే! పగటి పూట ఒంటిమీద చెయ్యి వెయ్యనివ్వదు. పోనీ ఎందుకలా ప్రవర్తిస్తుందో తెలుసుకుందామంటే ఆ ప్రసక్తిని తేనివ్వదు. 38 ఏళ్ళుగా యిదే తంతు.**

**నా పరిస్థితి మీరు గ్రహించి ఉంటారు. ఈ మధ్య కొన్నాళ్ళ నుంచి నాకు సెక్సు కోరికలు పూర్తిగా తీరనందువల్ల ఒకరకం అసంతృప్తితో రాత్రుళ్ళు టెన్షన్‌కి లోనవుతున్నాను. ఒకొక్కసారి (మధ్యరాత్రిలో) నా భార్య హస్తప్రయోగం చేసుకుంటూండటం చూసి ఆశ్చర్యపోయాను. ఆమె రతిని కాక**

**హస్తప్రయోగాన్ని ఎందుకు యిష్టపడుతున్నట్టు? రతిలో ఏ మాత్రం ఆసక్తి, చొరవ ఎందుకు చూపించటం లేదు? నోటితోనే అడగక్కర్లేదు కదా, కనీసం ప్రేమగా దగ్గరకు రావటమో, దగ్గరకు చేరి హత్తుకోవడమో చేసి అలా తన కోరికను ప్రకటించవచ్చు కదా! అలా ఎందుకు చేయదు?**

**మా సమస్య తీరితే ఇక మిగిలిన కొద్ది సంవత్సరాల సెక్సు జీవితాన్నయినా సంతోషంగా గడపగలమేమోనని ఆశ!**

**-బెంగుళూరు**

జ. మీరడిగిన ప్రశ్నలెన్నిటికో జవాబు చెప్పాల్సింది మీ భార్యే. ఆవిడ మనసులో ఏముందో, ఆవిడ అభిప్రాయాలు, ఆవిడ మనసులో పాతుకుపోయిన స్క్రిప్టులూ ఏమిటో ఆమెని ఇంటర్వ్యూ చేస్తే కాని తెలియదు. మిమ్మల్ని ఆ టాపిక్‌నే ఎత్తనివ్వని వ్యక్తి, కౌన్సిలింగ్‌కి వస్తారా అన్నది అనుమానమే! అయినా ప్రయత్నించండి. ఇద్దరూ వస్తే ఒకసారి తీగని కదిలించి చూద్దాము. కదిలితే డొంకంతా కదులుతుంది!

ఆమెకి సెక్సు కోరికలు, సెక్సు స్పందనలూ చక్కగా ఉన్నవనడానికి ఆమె హస్తప్రయోగమే సాక్ష్యం. మరి మీతో సెక్సుకి ఎందుకు యింట్రస్టు చూపటం లేదన్నది ఇంటర్వ్యూ ద్వారా మాత్రమే తేలాలి. ఆమె చేస్తున్న ఉద్యోగం/వృత్తి, సెక్సు గురించి ఉన్న అభిప్రాయాలు, సెక్సు పట్ల ఉన్న నిషేధాలు, మానసిక అడ్డంకులు- శరీర సొష్టవం సెక్సు వల్ల పాడవుతుందనే లాంటి అభిప్రాయాలు... ఇలాంటివి కాని యింకా లోతైన కారణాలు కాని ఉండవచ్చు. స్వయంగా యిద్దరూ రండి.

## నా కన్నా చిన్నవాణ్ణి (మైనర్ని) పెళ్ళాడాలి, ఎలా?

**నేను B.Sc. చదివాను. 20 సం॥లు పూర్తయ్యాయి. మా చుట్టాల అబ్బాయికి 19 సం॥లు. అతనూ నేనూ మనస్ఫూర్తిగా ప్రేమించుకుంటున్నాం. కాని అతని వయసు చిన్నది కావడం వల్ల మా యింట్లో కాని, వాళ్ళింట్లో కాని ఒప్పుకోరని మా భయం. మేం ఏం చెయ్యాలి? రిజిష్టర్ మేరేజ్ చేసుకుందామంటే అతని మైనార్టీ తీరడానికి యింకా రెండేళ్ళు ఆగాలి కదా! మాకు వేరే ఏ మార్గమూ లేదా?**

**-సు., వరంగల్**

జ. మీరిద్దరూ ప్రేమించుకోవడం వరకూ బాగానే ఉంది. ఇది ప్రేమకి పట్టాభిషేకం కడుతున్న యుగం కదా! వయసూ, వాతావరణం ప్రేరేపించి ఉంటాయి. మంచిది. మీరు పెళ్ళి చేసుకోవడానికి వయసుల తేడా ఏం అడ్డుకాదు. ప్రపంచంలో మీలాంటి వాళ్ళు (తనకంటే చిన్న మగవాణ్ణి చేసుకున్న ఆడపిల్లలు) వేల సంఖ్యలో ఉన్నారు.

కాని పెళ్ళికి తొందరపడే ముందు భవిష్యత్తు గురించి ఆలోచించండి. అదే ముఖ్యం. ఆ పిల్లాడికి ఉద్యోగం, వ్యాపారం, కుటుంబాన్ని పోషించే స్తోమతా ఉన్నాయా? మీకైనా ఏదైనా ఉపాధి ఉందా? ఆవేశంగా పెళ్ళి చేసుకున్నాక ఇద్దరికీ ఆధారం లేకపోతే కాలే కడుపులు ప్రేమని దహిస్తాయి జాగ్రత్త! అయినా మీ యిద్దరి వయసులూ చిన్నవే. పరస్పరం యిష్టపడ్డారు కాబట్టి జగ్రత్తగా మరో 2-3 సం॥లు యిలాగే నెట్టుకెళ్ళి ఆర్థికంగా స్థిరపడగానే పెద్దలతో చెప్పండి. వద్దంటే నచ్చజెప్పండి. అయినా వినకపోతే అప్పుడు రిజిష్టరు మేరేజి చేసుకోండి. అప్పటికి మీ ప్రేమా సుస్థిరమవుతుంది, జీవితానికి ఆధారమూ ఉంటుంది, పెద్దలు కాదన్నా ప్రేమని నిలబెట్టుకునే శక్తీ ఉంటుంది.

## సిగ్గుగా, బాధగా ఉంది!

**నాకొక మేనమరదలుంది. 5 రోజుల క్రితం అనుకోకుండా వాళ్ళింటికి వెళ్ళాను. ఒక్కతే ఉంది. అత్త, మామయ్య సమయానికి యింట్లో లేరు. ఏదో మాటల్లో పడి ఒకరికొకరు దగ్గరై ముద్దులు పెట్టు కోవడం దాకా జరిగింది. ఇంతట్లో పెద్దవాళ్ళు వస్తున్న అలికిడై వేరుపడ్డాము. ఆ రోజు నుంచి నా మనస్సులో చాలా సిగ్గుగా, బాధగా ఉంది. ఎందుకంటే నా మనసులో ఆ అమ్మాయి మీద ఎలాంటి యిష్టం లేదు. పెళ్ళి చేసుకోవాలన్న ఉద్దేశం లేదు. కాని అనుకోకుండా యిలా తప్పు చేసానని చాలా బాధ పడుతున్నాను. ఆ అమ్మాయి నా మీద ఆశ పెంచుకుంటుం దేమో? ఆ అమ్మాయి జీవితం నాశనం చేస్తున్నానా? -3842**

జ. ఇలా మధన పడుతూ కూచ్చున్నంత కాలం మనశ్శాంతి కోల్పోవడమూ, ఆ అమ్మాయి మనసులో ఆశలూ రేపడమూ తప్ప ఏం ప్రయోజనం లేదు.

జరిగిందేదో పీడకల అనుకోండి. అందులో యిద్దరి తప్పూ ఉంది. కనుక మీరొక్కరే బాధ పడుతూ ఉండిపోవద్దు. ఆమెని కలిసి అనాలోచితంగా, ఆవేశంలో అలా జరిగినందుకు సారీ చెప్పండి. ఆ అమ్మాయి మీద ఎలాంటి ఉద్దేశమూ లేని సంగతి కూడా యిప్పుడే చెప్పేసి క్షమాపణ కోరండి. ఆమె కూడా కేజువల్‌గా తీసుకుంటే సమస్యే లేదు. లేకపోతే మాత్రం అనునయంగా చెప్పి దూరమవ్వండి. ప్రారంభంలోనే తెంచకుండా... నాన్చితేనే అది పెద్ద సమస్యగా మారిపోవచ్చు. యవ్వనంలో యిలాంటివన్నీ మామూలే!

## బాధిస్తున్నాడు!

**నాదొక వింత సమస్య. మా పెళ్ళయి 2 సం॥లయ్యింది. మావారు పెళ్ళయిన నాటినుంచీ నా యోని లూజు అంటూ బాధపడటమూ, బాధపెట్టడమూ చేస్తున్నారు. చివరికి డాక్టరు దగ్గరకి వెళ్ళి యోని ద్వారం యిరుకయ్యేలా చిన్న ఆపరేషను కూడా చేయించుకున్నాను. అయినా ఆయనకు తృప్తి లేదట. యింకా టైటు కావాలట. మలద్వారంలో రతి చేస్తానని పట్టుపడుతున్నారు. నాకు అదంటే అసహ్యం. ఒప్పుకోకపోతే డైవోర్సు యిస్తానంటున్నారు. నేనూ ఉద్యోగస్తు రాలినే! బ్రతకగలను. మాకొక పాప ఉంది. పాప భవిష్యత్తు కోసం ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తూ ఉన్నా రాను రాను యితని ఆగడం భరించడం కష్టమవుతోంది. ఏదో ఒకటవుతుందని విడాకులకే నిర్ణయించు కుని, ఆఖరి ప్రయత్నంగా మీకు రాస్తున్నాను. యితన్ని మార్చే అవకాశం ఉందా?**

**-నెల్లూరు**

జ. మీరూ, మీవారు కలిసి సెక్సు కౌన్సిలర్‌ని సంప్రదించడమ్మా, లేదా యిక్కడకు స్వయంగా కలిసి రండి. మీ వారి మనస్తత్వాన్ని, అతని సమస్యని విశ్లేషిద్దాము. ఏవైనా మారే అవకాశం ఉంటే ముందుగా ఆ ప్రయత్నమే చేద్దాము. తెగించి విడాకులకే సిద్ధమయ్యేరంటే ఈ రెండేళ్ళలోనూ మీరెంత క్షోభపడి ఉంటారో ఊహించగలం. కేవలం 'యోని లూజు' అనే సమస్యను తేలిగ్గానే పరిష్కరించ వచ్చును. అది ఒక వంక మాత్రమే అయి, దాని వెనక శాడిస్టు మనస్తత్వమో, లైంగిక అసమర్థతో, లైంగిక ఆత్మన్యూనతో... అలాంటి మనో లైంగిక సమస్యలుంటే కొన్నిటిని తీర్చగలము, కొన్నిటిని తీర్చడం కన్నా, అతని ఖర్మానికి అతన్ని విడిచిపెట్టి మీరు జీవితాంతపు గుదిబండను వదిలించుకోవడమే ఉత్తమం కావచ్చును. ఏదైనదీ కౌన్సిలింగ్ అనంతరం నిర్ణయించుకోవడం క్షేమమని మా అభిప్రాయం. అలాంటి కౌన్సిలింగు ఏదీ మీరు గతంలో తీసుకున్నట్టుగా మీరు ఉత్తరంలో రాయలేదు మరి!

**నా వయసు 28. పెళ్ళయి 3 సం॥లయింది. నా శ్రీమతి నేను అన్యోన్యంగానే ఉండేవాళ్ళం కాని ఇటీవల నా భార్య ప్రవర్తన నాకు నచ్చక తరచు ఘర్షణ పడుతున్నాం. ప్రవర్తన అంటే చెడు అనుకోకండి. తను చాలా మంచిదే. కాని సిటీలో పెరిగి వచ్చిన మీదట మా చిన్న పట్టణంలో ఈమె ప్రవర్తన నాకు తలవంపులు తోస్తోంది. అందరూ నా గురించి చెవులు కొరుక్కుంటున్నట్టు అనిపిస్తోంది. వీధిలోకి వచ్చి అందరు మగవాళ్ళతో సమానంగా మాట్లాడవద్దంటే వినదు; డాబా మీదికి నైటీతో వెళ్ళి బట్టలారేస్తుంది. చుట్టుపక్కల డాబాల మీద కుర్రాళ్ళు పళ్ళికిలిస్తున్నా మానదు. వింత వింత డ్రెస్‌లు వేసుకుంటుంది. ఇదేం మనస్తత్వమో అర్థం కాదు. ఇంకా అన్నీ ఇలాంటివే! ఈమెను మార్చేదెలా? ఈమెను చూసి చుట్టుపక్కల ఆడపిల్లలు కూడా యిలా తయారవు తున్నారు.**

**-పిఠాపురం**

జ. కొందరు స్త్రీలు చాలా ఎసర్టివ్‌గా ఉంటారు. కాన్ఫిడెంట్‌గా ఉంటారు. చుట్టు పక్కల మొరిగే కుక్కల్ని చూసి కన్ను కూడా చికిలించని ఏనుగుల్లాంటి దృఢ చిత్తం వాళ్ళది. సిటీలో పెరిగిన అమ్మాయి అంటున్నారు కదా, అక్కడ ఇలాంటి కోర చూపులు, వాడి చూపులూ చిన్నప్పట్నుంచీ ఎన్నో చూసిన మీదట ఇక్కడి కుర్రకారు చేష్టల్ని ఆమె లెక్కచేయక పోతూండవచ్చు. నూతిలో కప్పకి నుయ్యే ప్రపంచమైనట్టు పల్లెటూళ్ళు, పల్లే, పట్నమూ కాని మధ్యరకం ఊళ్ళు- వీటిల్లో ప్రజల తీరే అంత! ఆమాటకొస్తే మహానగరాల్లోని ఫేషన్స్‌ని ఓ మాదిరి నగరాలు జీర్ణం చేసుకోలేవు. ఆ నగరాల్లోని ఫేషన్లని, సంస్కృతిని పట్టణాలు, పల్లెల్లోని వాళ్ళు జీర్ణించుకోలేరు. ఇది ఎక్కడైనా మామూలే! అలవాటయ్యే దాకా అలానే ఉంటుంది. మీ భార్యని చూసి యింకొందరు అలా తయారవుతున్నా రన్నారు. మంచిదే కదూ! అప్పుడు దృష్టి మీ భార్యమీద నుంచి మళ్ళుతుంది. కొన్నాళ్ళకి అందరూ అలవాటు పడిపోయి పట్టించుకోవడం మానేస్తారు.

మీలో మీ భార్యగురించిన అభద్రతా భావం పెరగనివ్వకండి. ఆమె నొచ్చుకునే విధంగా కాని అధికార పూర్వకంగా కాని ఆమె ప్రవర్తనని విమర్శించకండి. అలా చేస్తే స్వతంత్ర వ్యక్తిత్వం గల వ్యక్తులు వినరు. ఆమె ప్రవర్తన వల్ల కలిగే యిబ్బంది ఏమిటో ఆమెకి స్నేహ పూర్వకంగా వివరించి నచ్చజెప్పండి. ఆమె పాయింటేమిటో అది కూడా మీరు విని ఆలోచించండి. అది సబబే అనిపిస్తే అంగీకరించడానికి సందేహించకండి. తద్వారా మీమీద ఆమెకి గౌరవం పెరుగు తుంది. పెరిగితే... మీ మాటకి ఆమె విలువ యిస్తారు. ఒకసారి యిద్దరూ కలిసి రండి. మీ ఊరి పక్కనే కదా మా ఊరు కూడా! యిద్దరితోనూ చర్చించి మీ మనస్తాపం తగ్గే ఉపాయాలు వెలికి తీద్దాము.

## జారుడు పదార్థం మంచిదేనా?

**మేము సెక్సులో పాల్గొన్న ప్రతీసారీ అంగ ప్రవేశం జరగడంకోసం జారుడు పదార్థం వాడాల్సి వస్తోంది. కొన్నాళ్ళు KY జెల్లీ వాడేము. అది దొరకకపోవడం తోనూ, ఖరీదు వల్లా కొబ్బరి నూనె కాని, వంట నూనెని కాని వాడుతున్నాము. యిలా ఎప్పటికీ మేము ఏదో ఒకటి వాడాల్సిందేనా? అలా వాడటం మంచిదేనా?**

**-జహీరాబాద్**

జ. KY జెల్లీ లాంటి నీటిలో కరిగే జారుడు పదార్థాలు ఎంతకాలం వాడినా నష్టం లేదు. నూనెల వాడకాన్ని మేం ప్రోత్సహించం. అవి యోనిలోని సహజ వాతావరణానికి భంగం కలిగించవచ్చు, వీర్య కణాల ప్రయాణానికి అవరోధం కావచ్చు - అందుకని.

మీ యిద్దరి వయసులూ ఎంతో రాయలేదు. 40-50లు దాటిన వారైతే పై పదార్థాల వాడకానికి

అభ్యంతరం లేదు. ఆలోపువారు, ముఖ్యంగా పిల్లలు ఇంకా కలగనివారైతే నూనెలు వాడకండి. రతికి ముందు తగినంత సేపు ప్రణయకళలో పాల్గొండి. ఎప్పుడూ ఒకే పద్ధతులు, ఒకే వరస క్రమం, ఒకే భంగిమ కాకుండా తరచు వాటిని మార్చండి. రోజూ ఒకసారి, రెండ్రోజులు కొకసారి అంటూ టైం టేబిలు పెట్టుకోకుండా కోరికను బట్టి మాత్రమే రతిలో పాల్గొనండి. ఉద్రేకం కలిగించే మాటలు, దృశ్యాలు, ఊహలు జోడించుకోండి. ఈస్టువ్యాధులు (కేండిడ్రియాస్) వంటివి ఉంటే యిద్దరూ దానికి చికిత్స చేయించుకోండి. రతి బాధాకరంగా ఉండటానికి అదొక కారణం. యితరేతర కారణాలుంటే డాక్టరు తగు చికిత్స సలహాలిస్తారు. (ఉదా : స్త్రీ హార్మోను తక్కువగా ఉత్పత్తవ్వటం, మానసిక నిరోధాలు)

## సుంతీ అవసరమా?

**రతిలో సరైన సుఖం కలగాలంటే సుంతీ చేయించుకోవడం అవసరమా? సుంతీవల్ల అంగశీర్షం మొద్దుబారి సెక్సు సుఖం తగ్గిపోదా?**

జ. రతి సుఖం కోసమైతే సుంతీ చేయించుకోవాల్సిన అవసరం లేదు. ఏకారణం వల్ల సుంతీ చేయించుకున్నా వాళ్ళకి రతిసుఖం ఏమీ తగ్గదు. శిశ్నశీర్షం ఉపరితలానికి నైశిత్యం తగ్గినా, చర్మం దిగువ వరసల్లో ఉండే నాడులచిగుళ్ళు ఇంకా నిశితంగానే ఉండి వాటి విధిని చక్కగా నిర్వర్తించి, సుఖం మామూలుగానే కలిగిస్తాయి.

## మగవాళ్ళకి బహుభావప్రాప్తులు

**మగవాళ్ళకి ఆడవాళ్ళలా ఒకే రతిలో ఎక్కువ భావప్రాప్తులు (Multiple Orgasms) కలగవా? నేను చాలా సార్లు ట్రై చేసాను కాని ఒక్కసారి మాత్రం అనుకోకుండా దానంతట అదే 2 భావప్రాప్తులు ఒకేసారి కలిగేయి. మొదటిసారిగా లైట్‌గా కలిగింది. వీర్యం రాలేదు. రతి ఆపకుండా అలానే చేసేసరికి మరొక నిమిషంలో మళ్ళీ భావప్రాప్తి కలిగి ఈసారి వీర్యం వచ్చింది. వీర్యం రాలేదు కాబట్టి అది భావప్రాప్తి అవుతుందా కాదా కూడా వివరించండి.**

**- జలాలాబాద్**

జ. మల్టిపుల్ ఆర్గాజమ్స్ (ఒకే రతిలో ఒకటికన్నా ఎక్కువ భావప్రాప్తులు పొందడం) స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తుంది. దాదాపు నూటికి 10-40 మంది స్త్రీలు బహుభావప్రాప్తులు పొందలేకపోవచ్చు. (మొదటిది ఘనతాకాదు, రెండోది న్యూనతా కాదు సుమా!).

మగవాళ్ళలో బహుభావప్రాప్తులు కలగడం చాలా అరుదు. పురుషుడికి ఒకసారి భావప్రాప్తి కలిగేక మరల లైంగిక స్పందనలు కలగడానికి కొంత టైం (గంటల నుంచి రోజుల దాకా) పడుతుంది. కొద్దిమందిలో మాత్రం యాదృచ్ఛికంగా కాని, ప్రయత్నం మీదట గాని బహుభావ ప్రాప్తులు కలుగుతాయి. శీఘ్రస్ఖలనాన్ని అదుపు చేసే ప్రయత్నంలో కొందరు ఈ రకం అనుభవాలను పొందినట్టు రాశారు.

ఇకపోతే పురుషుడి విషయంలో భావప్రాప్తి, వీర్య స్ఖలనమూ - రెండూ వేర్వేరు ప్రక్రియలు - కాని రెండూ ఒకేసారి జరగడం వల్ల ఒకటే అనుకోవడం జరుగుతుంది. ఒక్కొక్కసారి స్ఖలనం లేని భావప్రాప్తి కలుగుతుంది. దాన్ని భావప్రాప్తి అనే అనాలి. ఒకోసారి - ముఖ్యంగా పెరాలసిస్ పేషెంట్లలో - భావప్రాప్తి సుఖం కలగకుండానే వీర్యస్ఖలనం జరగవచ్చు. దాన్ని స్ఖలనమనే అంటాం కాని భావప్రాప్తి అనము.

## సందేహాలు

**• రొమ్ములు చిన్నవిగా ఉన్న ఆడవాళ్ళకి స్త్రీత్వం పూర్తిగా లేదను కోవచ్చా? రొమ్ములు చిన్నవిగా ఉంటే కామవాంఛ సరిగా ఉండదా?**

**• భార్య బహిష్టవుతున్న రోజుల్లో కామం ఆపుకోలేక భర్త హ.ప్ర. చేసుకుంటే నష్టమా?**

జ. కేవలం రొమ్ముల సైజుని బట్టే స్త్రీ స్త్రీత్వాన్ని నిర్ణయించకూడదు. శారీరకమైన స్త్రీత్వం స్త్రీ ద్వితీయ లైంగిక లక్షణాల మీద, అంతర్గత జననాంగాల మీద ఆధారపడి ఉంది. స్త్రీ శరీరంలో వయసొచ్చేక ఏయే మార్పులు రావాలో (చూ. 'సెక్స్ ఎటానమీ' గ్రంథం) అవన్నీ కలిగితే ఆమె స్త్రీత్వం శారీరకంగా సంపూర్ణమే! అలాంటి స్త్రీలో రొమ్ములు చిన్నవిగా ఉన్నా అది ఆమె శరీర తత్వమే తప్ప స్త్రీత్వం లోపించడం మాత్రం కాదు.

రొమ్ముల సైజుకీ, కామవాంఛకీ సంబంధం లేదు. చిన్న రొమ్ములున్నా వాంఛ మామూలుగానే ఉంటుంది.

02. భార్య బహిష్టవుతున్నందు వల్లనో, ఊళ్లో లేనందునో, మూడ్ లేక రతికి అంగీకరించనందు వల్లనో... ఇంకా ఏ కారణం వల్ల హ.ప్ర. చేసుకున్నప్పటికీ దానివల్ల నష్టం లేదు. అదేమీ విపరీత చర్య కాదు! ఒకే?

## హోమో సెక్సువల్‌ని!

**నాకు 12 సం॥ల వయసప్పుడు మా యింట్లో నౌకరు నన్ను హోమో సెక్సులోకి దింపాడు. అప్పట్లో అది అదని నాకు తెలియదు. పెద్దలకు చెప్తే చేతబడి చేస్తానని భయపించడంతో ఎవ్వరికీ చెప్పుకోలేకపోయే వాడిని. ఒకసారి వాడిని పొలంలో పాము కాటెయ్యడంతో చచ్చిపోయాడు. నాకు పీడ విరగడైంది అనుకున్నాను కాని ఆ అలవాటు పోలేదు. వేరే దోస్తులతో మొదలు పెట్టాను. ఇప్పుడు నాకు 19 సం॥లు. నాకు ఆడవాళ్ళతో కూడా కలిసి తిరగాలని, సెక్సు చెయ్యాలని ఉంటుంది కాని నేను హోమో సెక్సువల్‌ని కనుక స్త్రీతో రతి చేయలేనేమోనని భయపడు తున్నాను. నేను పెళ్ళి చేసుకోవచ్చా?**

**-హైదరాబాదు**

జ. మీరు మరో మగవాడితో (same sex person తో) కొన్ని పరిస్థితుల్లో మీ ప్రమేయం లేకుండా పాల్గొనడం జరిగింది తప్పితే స్వభావరీత్యా మీరు హోమోసెక్సువల్ కారు. మీలో స్త్రీ పట్ల సెక్సు కోరికలున్నాయి, స్త్రీని పెళ్ళాడాలనే కోరిక ఉంది, కాని "నేనొక హోమోసెక్సువల్‌ని" అని మీకు మీరే ముద్ర వేసుకుని మీ గురించి మీరు సందేహ పడుతున్నారు. అనగా మీకు హోమోసెక్సువల్ అనుభవాలు కలిగినై తప్ప మీరు నిజమైన హోమోసెక్సువల్ కారు. కనుక నిరభ్యంతరంగా పెళ్ళి చేసుకుని సుఖపడగలరు.

అయితే గతంతో పొందిన కామానుభవాలు అప్పుడప్పుడు జ్ఞాపకం రావడం, వాటిమీదకి మనసు పోవడం సహజంగా జరుగుతుంది. అలాంటి ఫీలింగ్స్‌ని ఎలా హేండిల్ చెయ్యాలో మీరు తెలుసుకోవడం మేలు చేస్తుంది. స్వయంగా సంప్రదించండి. ఒకసారి జననాంగ ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోండి.

## ఆత్మహత్యే శరణ్యమా?

**నేనొక వ్యక్తిని ప్రేమించాను. యిద్దరం పెళ్ళి చేసుకుందామని ప్రమాణాలు చేసుకున్నాం. ఆ ధైర్యంతోనే సెక్సులో కూడా పాల్గొన్నాము. అయితే నా జాతకం కొద్దీ ఆ అబ్బాయి ఇంట్లో గొడవలు పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది జరిగి 3 సం॥లైంది. అతన్ని యిప్పుడిప్పుడే మరిచిపోగలుగుతున్నాను. మా యింట్లో వాళ్ళు పెళ్ళి చేస్తామని చాలాకాలంగా పోరు పెడుతున్నా నేను ఒప్పుకోలేదు. ఇప్పుడు పెళ్ళి చేసుకుంటే నేను కన్యను కానని అతనికి తెలిస్తే నా జీవితం ఏమవుతుందనే భయంతో బ్రతకలేక బ్రతుకుతున్నాను. ఏ దిక్కూ తోచక ఆత్మహత్యకి మించిన పరిష్కారం లేదనిపిస్తోంది.**

**-ఏలూరు**

జ. చిన్న సమస్యలకి పరిష్కారాలు కూడా చిన్నవిగానే ఉండాలమ్మా, ఇంత చిన్న ప్రోబ్లమ్‌కి ఆత్మహత్యదాకా పరిగెట్టాలా? అసలు ఏ సమస్యకీ ఆత్మహత్య పరిష్కారం కాదు. సమస్యని ఎదుర్కోవడమే సరైన పరిష్కారం.

అదలా ఉంచు. నీ పాత ఎఫైర్ గురించి, అందులో నువ్వెంత లోతుగా వెళ్ళిందీ నువ్వూ మరిచిపో, ఇతరులకీ చెప్పకు. ముఖ్యంగా జీవిత భాగస్వామికి అస్సలు చెప్పొదు. దంపతుల మధ్య దేన్లోనూ దాపరికం ఉండకూడదంటారు కాని దీన్లో మాత్రం ఉండాలి. నువ్వు గతంలో సెక్సులో పాల్గొన్న సంగతి నీ భర్త గుర్తించలేడు. ఒకోసారి డాక్టర్లే గుర్తించలేరు. ఎందుకంటే కన్నెపొర అనేక కారణాల వల్ల చిరిగిపోతుంది. సైకిలు తొక్కడం, ఆటలు, ఈత, వ్యాయామాలు, హస్తమైథునం ఇవన్నీ కన్నెపొర చిరిగిపోయేట్టు చేస్తాయి. కనుక నీకు కన్నెపొర లేదని డాక్టరు సర్టిఫికెటిచ్చినా అది దేనివల్ల చిరిగిందో మాత్రం డాక్టర్ చెప్పలేడు. కనుక అన్నీ మరిచిపోయి ధైర్యంగా పెళ్ళి చేసుకో. అతనితో పెళ్ళి జరుగుతుందనే నమ్మకతో సెక్సులో పాల్గొన్నావు కాని జారబుద్ధితో కానందున నీకు దోషం అంటదు.

## విడాకులు పొందడమెలా?

**నా పెళ్ళయి ఏడాదిన్నర అయింది. నా భార్య గురించి నాకు పెళ్ళికి ముందు తెలియదు. పై సంబంధం చేసుకున్నాను. నా భార్య భారీ కట్నంతో వచ్చింది. నా తల్లిదండ్రులతో ఆమెకి రోజూ తగాదాయే. నన్ను కూడా రోజూ ఏదో ఒక దానికి అవమానించడమో, గాయపరచడమో చేస్తుంది. మనసు పాడై, పడుకుంటే- సెక్సు సుఖం కూడా యివ్వలేనివాడివి పెళ్ళెందుకు చేసుకున్నావంటుంది. నాకు మనసు అంగీకరించకపోయినా ఆమె శాపనార్థాలు వినలేక సెక్సుకి ప్రయత్నిస్తే అయిన రోజు అవుతుంది, లేనిరోజు లేదు. నాకు అంగం గట్టిగా స్తంభించకపోయినా, తొందరగా స్ఖలనం అయిపోయినా ఆ రోజు నా పని అంతే- ఎన్ని తిట్లు తగుల్తాయో లెక్కలేదు. ఇన్ని మాటలంటుంటే సెక్సు ఎలా చేయగలను? నీ గయ్యాళితనం వల్ల నీ మీద నాకు యిష్టం కలగటం లేదని మొహంమీద చెపితే పెళ్ళి చేసుకున్నాక "సుఖపెట్టడం నీ డ్యూటీ" అని గదమాయిస్తుంది. 'నీ వల్ల సుఖం లేనందుకే నేనిలా తయారయ్యాను, పెళ్ళికి ముందు బాగుండేదాన్ని' అంటుంది. ఈమెతో కాపురం చేయడం ఇక నా వల్ల కాదనిపిస్తుంది. ఈమెతో విడాకులు పొందటం ఎలా?**

**-నిజామాబాద్**

జ. మీరు రాసినదాన్ని బట్టి ఆమె స్వభావంలో పేచీకోలుతనం, తన పంతమే తప్ప, ఎదుటివారి కోణం నుంచి ఆలోచించే గుణం లేదనిపిస్తోంది. అయినా ఒకసారి ఆమె వాదన ఏమిటో, కష్టసుఖాలేమిటో తెలుసుకోకుండా ఏకపక్ష నిర్ణయం చెప్పటం న్యాయం కాదు. మీ భార్య సహకరిస్తే ఓసారి

మేరేజ్ కౌన్సిలరు/ మేరిటల్ థిరపిస్టుని సంప్రదించండి. పరిస్థితులు చక్కబడేందుకు వీలైనంత సహాయపడతారు.

ఒక్కటి మాత్రం నిజం- సెక్సు విషయంలో 'హక్కులు' అనేవి ఎవరికీ లేవు. భార్యాభర్తలిద్దరూ కలిసి కృషిచేసి ఎవరి సుఖం వారు సంపాదించుకోవాలి. అందుకు రెండవవారు వీలైనంత సహాయపడాలి. లోటుపాట్లు ఏర్పడితే- ఇద్దరూ కలిసి సెక్సు థిరపిస్టు / కౌన్సిలర్ సహాయంతో సరిచేసుకోవాలి. నిందించుకోవడం సమస్యని ముదరబెడుతుందే కాని తీర్చదు.

## మనసు తపిస్తోంది

**నాకు ప్రస్తుతం 60 సం॥ములు. 'అభిసారిక' ప్రసాదించిన విజ్ఞానం ఆధారంగా, నా సంసార జీవితం చాలా ఆనందమయంగా అనుభవించాను. ప్రస్తుతం 6,8 నెలలుగా ఒక సమస్యతో బాధపడుతున్నాను. నా మనసు ఇంకా సంసార సుఖం కోసం పరితపిస్తుంటే, నా అంగం ఇది వరకు వలె గట్టిగా స్తంభించడం లేదు. ఇది చాలా సడన్‌గా ప్రారంభం అయింది. నాకు తెలిసినంత వరకు, ఫ్రీక్వెన్సీ తగ్గవచ్చు కాని, అంగ స్తంభన తగ్గదు. నాకు పూర్వము వలె అంగ స్తంభనలు కలగాలంటే ఏ మందులు వాడాలో వివరించవలసినదిగా ప్రార్థిస్తున్నాను.**

**- ఎం., తాడేపల్లి గూడెం**

జ. మీలాంటి దశాబ్దాల పాఠకుల ఉత్తరాల పలకరింపు ఎప్పుడూ పులకరింప జేస్తూంటుంది. '62 నుంచి నేటిదాకా పాఠకులుగా కొనసాగుతున్న వారి సంఖ్య వందలలో ఉండటం మాకెంతో గర్వకారణం.

మీ సమస్య విషయానికొస్తే మనసుయింకా సంసారసుఖం కోసం పరితపిస్తున్నా శిశ్నం మాత్రం సహక రించడం లేదన్నారు. అదిన్నీ సడన్‌గా ప్రారంభమైందన్నారు. కొన్నిరకాల శిశ్నస్తంభన సమస్యలు హఠాత్తుగా స్టార్టవుతాయి - అవి మానసికమైనవీ కావచ్చు, శారీరకమైనవీ కావచ్చు, కొన్ని స్తంభన సమస్యలు కొంచెంగా స్టార్టయి క్రమేణా ఎక్కువవుతాయి. షుగర్‌వ్యాధి వల్ల, స్మోకింగ్, హై.బి.పి. వల్ల స్టార్టయ్యే స్తంభనదోషాలు యిలాంటివి.

ఒకసారి స్తంభనాన్ని ప్రభావితంజేసే ఆరోగ్య సమస్యల గురించి, జనరల్ హెల్త్ గురించీ, అటుపై స్తంభన సమస్య స్వభావం, తీవ్రతల గురించీ పరీక్ష చేయిద్దాము. దానికన్న ముందు మీరు వాడి చూడదగిన మందులు పెర్సనల్ పోస్టులో తెలియపరిచాము. అవి వాడిన అనంతరం ఫలితం కనిపించకపోతే పై టెస్టులు చేయిద్దాము.

ఈలోగా మీరొకసారి ఈ 6,8 నెలల క్రితం సెక్సుని ప్రభావితం చేసే సంఘటనలు ఏమైనా జరిగినవేమో గుర్తించండి. అది మలేరియా, టైఫాయిడ్ లాంటి అనారోగ్యం కావచ్చు; ఏదేని దీర్ఘకాలిక ఔషధాలు వాడటం మొదలుపెట్టడం కావచ్చు; అనుకోకుండా 1-2 సార్లు అంగ స్తంభనాలు విఫలమై ఆందోళన కలిగించడం కావచ్చు. ఇలాంటివేవి దృష్టిలోకి వచ్చినా తెలియపరచండి.

## HIV గల వారితో అంగుళీరతి

**HIV/ఎయిడ్స్ ఉన్న పురుషుడు ఆరోగ్యవంతురాలైన స్త్రీ యోని భాగాలను చేతులతో ప్రేరేపించవచ్చా? (యోనిలోపల కూడా.) ఆ వ్యక్తి చేతులకి గాయాలు పుళ్ళు ఏమీ లేనిచో స్త్రీకి వ్యాధి సంక్రమించదు కదా?**

**ఆ పురుషుని వీర్యం స్త్రీ చేతిమీద పడటం జరిగింది. అది తడారిపోయినది. కాని ఆ స్త్రీ పొరపాటున**

**చెయ్యి కడుక్కోవటం మరిచి తన జననాంగాలను తాకినా, ఆహారం తిన్నా ఆమెకి HIV వస్తుందా?**

జ. HIV సోకిన ఒక వ్యక్తి ఆరోగ్యవంతులైన తన భాగస్వామితో ఈ రకం అంగుళీ రతి, హస్తరతి చేయవచ్చును. వ్యాధిగ్రస్తుని చేతులకి గాయాలు, పుళ్ళు పగుళ్ళు లేని పక్షంలో భాగస్వామికి నష్టం జరగదు. కాని సెక్సులో లీనమైనప్పుడు ఒకోసారి హద్దులు మరిచిపోవడం జరుగుతుంది. ఆ హద్దు దాటకుండా జాగ్రత్తపడాలి. రతి చేయకపోయినా అంగానికి కండోమ్ తొడిగితే స్ఖలనం కండోమ్‌లోనే జరగటం వల్ల లేనిపోని సమస్యలు రావు.

ఇక రెండో ప్రశ్న : పూర్తిగా పొడి ఆరిపోయిన వీర్యంలోని HIV వల్ల రెండో వ్యక్తికి ఇన్‌ఫెక్షన్ రాదు. ఆ చేత్తో ఆహారం తింటే అసలే రాదు. అయితే హద్దులు దాటి పోవడమని పైన చెప్పిన విషయానికి ఇది కూడా ఓ ఉదాహరణే! అందుకే జాగ్రత్త చాలా అవసరం. ఎల్లవేళలా అతి జాగ్రత్తగా ఉండటం కూడా కష్టమే. కనుక పరస్పర హ.ప్ర. కన్నా స్వీయ హ.ప్ర. ఉత్తమం.

## ఆందోళనతో సెక్సు సమస్యకి లోనయ్యా!

**నా వయస్సు 24 సం॥లు. పెళ్ళి కాలేదు. నాకు రెండునెలల్నుంచి అంగస్తంభన సమస్య ఏర్పడింది. నాకు ప్రతీరోజు హస్తప్రయోగం చేసే అలవాటుంది. దీని వల్ల మంచి తృప్తిని పొందుతాను.**

**అయితే, ఓ రోజు భయంగా, ఆందోళనతో హస్తప్రయోగం చేశాను. అప్పుడు అంగం పూర్తిగా స్తంభించలేదు. అలా పది రోజుల పాటు భయంగా, ఆందోళనతో అంగం పూర్తిగా స్తంభించకున్నా హస్తప్రయోగం చేశాను. అప్పటి నుండి నాలో సెక్స్ కోరికలు తగ్గినట్లుగా అన్పిస్తోంది. అంగం పూర్తిగా స్తంభించట్లేదని అనుమానంగా ఉంది. నాలో నపుంసకత్వం గూర్చిన భయాలు ఎక్కువయ్యాయి.**

జ. సమస్యా మీకు తెలుసు. సమస్యకి కారణమూ మీకు తెలుసు. యింకేంటి ప్రాబ్లం? భయంగా ఆందోళనగా హస్తప్రయోగం చేస్తే అంగం సరిగా స్తంభించదు. ఆ మాట కొస్తే భయంతో ఏ పని మాత్రం సరిగా చెయ్యగలరు? పరీక్ష రాయగలరా? స్టేజి మీద మాట్లాడగలరా? డ్రామాలో నటించగలరా? అన్ని అపజయాలకీ ప్రధాన కారణం భయమే. ఆందోళనే! దాన్ని పోగొట్టుకున్నారో... జయం మీదే!

కనుక భయాన్ని, ఆందోళనని 'విజ్ఞానం'తో తుడిచిపారెయ్యడమే మీ సమస్యకి చికిత్స.

మీకు కొన్ని సైకియాట్రిక్ సమస్యలున్నాయని రాశారు. అది మీ అభిప్రాయమా లేక డాక్టర్ డయాగ్నోసిసా? అనుమానం ఏర్పడింది కనుక తప్పకుండా సైకియాట్రిస్ట్‌ని సంప్రదించండి. మానసిక మందులు వాడాల్సి వస్తే సందేహించకుండా వాడండి. అన్ని మందుల వల్లా సెక్సువల్ సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. ఉంటే మందుల్ని మార్చుకోవచ్చు లేదా డోస్ అడ్జస్ట్ చేయవచ్చు. అదీగాక, ఆ మందుల ప్రభావం (ఉంటే) అవి వాడినన్నాళ్ళే ఉంటుంది. కాబట్టి దాన్ని గురించి కొత్త ఆందోళన తెచ్చుకోవద్దు. సరేనా?

## మూడోసారి సిజేరియన్

**నాకు ఇద్దరు అమ్మాయిలు "సిజేరియన్" ద్వారా జన్మించారు. అయితే మాకు వారసుడు కావాలి. అందుకోసం మేము ఏమైన పద్ధతులు అనుసరించాలా? లేక మందులు గాని, ప్రయోగాలు గాని ఉన్నాయా? మాకు వారసుడు జన్మించాలంటే మేము ఏం చేయాలి.**

**- ఆర్., అరబ్‌ఎమిరేట్స్**

జ. మగపిల్లాడే పుట్టే శాస్త్రీయ విధానాలేమీ లేవు. సెక్స్ ప్రీసెలక్షన్ అంటూ కొంతమంది ప్రకటనలు యిస్తున్నాగాని అవి చట్ట విరుద్ధం. అమ్మాయి అయినా అబ్బాయి అయినా ఒకటే అనే వాస్తవ దృక్పథం అలవరుచుకో గోరుతున్నాము. ఒకరిపట్ల అమితంగా ఆసక్తి కనబరచడం వల్ల రెండోవారి మనసులో తాము మీ ప్రేమకీ, ఈ పుట్టుకకీ అనర్హులమనీ, తాము తక్కువ వారమనీ అభిప్రాయం ఏర్పరుచుకునే రిస్కు ఉంది. దానివల్ల వారి వికాసం కుంటుపడుతుంది. పిల్లమొహాలు వాళ్ళకేం తెలుసులే అనుకుంటూ తల్లిదండ్రులు చేసే తప్పులు కొన్ని తలరాతల్నే మార్చేస్తాయి. అలాంటి పొరపాటుని విజ్ఞులైన వారెవ్వరూ చేయకూడదని మా మనవి.

02. రెండు సార్లు మీ భార్యకి సిజేరియన్ జరిగింది. రెండూ ఆమెకి పునర్జన్మలే. 3వ సారి సిజేరియన్ చేయడం క్షేమం కాదు. ఆడా, మగా ప్రసక్తి తరువాత! ముందసలు 3వ గర్భమే ప్రమాదకరం కనుక ఆ ఆలోచన విరమించగోర్తాము.

## అణుచుకోకండి

**నా సమస్యకి మంచి పరిష్కారం చూపించగలరు. లేకపోతే నా జీవితమే వేస్టు అనిపిస్తుంది. సంవత్సరం క్రితం ఈ సమస్యల గురించి వ్రాసినాను. అప్పుడు మీరు ధైర్యం చెప్పారు. ఇప్పుడు నాకు పెళ్ళి అయింది. నేను ఇంతకుముందు ఎవరితోనూ సంబంధం పెట్టుకోలేదు. రోజు హ.ప్ర. దాదాపు రెండు సంవత్సరాలు చేసేను.**

**ఈ మధ్య హ.ప్ర. చేసినపుడు అంగం మెత్తగానే వుండేది. అయినా వీర్యం పడేవరకు అలాగే చేసేవాణ్ణి. అప్పుడప్పుడు అంగం గట్టిగానే అయేది, కానీ ఎప్పుడూ ఇతరులతో సెక్స్‌లో పాల్గొనడం అంటే సిగ్గుగా అనిపించేది. ఎందుకంటే సెక్స్‌లో సంతృప్తిని ఇస్తానో లేదో డౌట్ అనిపించేది. వాళ్ళు ఫీల్ చేస్తారు అని అనుమానంతో ఏ రకమైన ఫీలింగ్స్ వచ్చేవి కాదు. అదీకాక, పరాయి వాళ్ళతో సెక్స్ చేయవద్దు నా భార్యకే సొంతంగా వుండాలి అనే ఫీలింగ్స్ వుండేవి.**

**పెళ్ళి అయ్యేక నేను మామూలుగానే సెక్స్‌లో పాల్గొన్నాను. అంగం గట్టిగానే అయింది. ఇప్పుడు యోనిలో పెట్టగానే మెత్తబడుతూ తగ్గిపోతోంది. మళ్ళీ గట్టిపడడం లేదు. సరిగా మూడు రావడం లేదు. నా వైఫ్ మూడు రావడం లేదా అంటుంది. ఎక్కువ సేపు ప్రణయ కళ చేస్తే వెంటనే అవుట్ అవుతుంది. దయచేసి నా సమస్య తొందరగా తీర్చండి. - సిరిపురం**

జ. అంతా బాగానే ఉంది కాని ముందుగా మీరు మనసుని అతిగా నొక్కి పట్టి ఉంచారు చూసారా? ఆ పట్టు విడవండి. మీ మీద మీకున్న డౌట్‌తో - సెక్సులో భార్యని సంతృప్తి పరచలేనన్న అనుమానంతో - వాళ్ళేమన్నా అనుకుంటారన్నా సంకోచంతో - మీరు పెళ్ళికి ముందు ఏ స్త్రీతోనూ సెక్సులో పాల్గొనకుండా ఎలా మీ మనసుని అణిచిపెట్టుకున్నారో... స్వంత భార్య దగ్గరకూడా అదే సంకోచం, సందేహం, భయంతో రతికి ఉపక్రమిస్తున్నారు. అందువల్లనే మీకు మీ భార్య వద్ద మూడ్ రావటం లేదనిపిస్తోంది. దానికి తోడు సెక్సు పరిజ్ఞానం మీకు తక్కువగా ఉంది. అందువల్ల భార్య దగ్గర ప్రణయంలో సరిగ్గా మసలలేక పోతున్నారు. నోనో ఇది కాదు పద్ధతి. మీరొకసారి వెంటనే స్వయంగా కలవండి. భార్యాభర్తలిద్దరూ వస్తే ఉత్తమం.

సెక్స్ థెరపీ ద్వారా మీ యిద్దరూ సుఖ సంతోషాలతో సెక్సు జీవితం గడిపేందుకు వీలుగా మీ సమస్య పరిష్కరిస్తాము. ఈలోగా మా ప్రచురణలైన జననాంగ విజ్ఞానం (సెక్స్ ఎనాటమీ), సృష్టి రహస్యం, నాగరిక దాంపత్యం, ప్రణయకళ అదే వరుస క్రమంలో చదవండి. అక్కడే మీకు సగం (బహుశా మొత్తం) సమస్య తీరిపోతుంది.

# వందే పార్వతీపరమేశ్వరౌ

**నా వయసు 88 సం॥లు. నా భార్యకు 65. ఈమె నా రెండవ భార్య. 50 సం॥ల నుంచి నాతో కాపురము చేస్తూ మహాసేవలు తృప్తిగా చేయుచున్నది. నాకు 2 సం॥ల నుంచీ సుస్తీ. ఇప్పుడు బాగుగానే ఉన్నాను. 1 సం॥నుంచి అంగస్తంభనము సరిగా అగుటలేదు. ఇప్పుడు నా కామ వేగమును ఆపుకొనలేక మైథునము లేకున్నను శృంగారపు చేష్టల చేత (యోని, వక్షోజ చుంబన చూషణములతో) ఆమెని ఒప్పించి రతి సల్పుచుంటిని. ఒకవేళ రతి జరుపుదామన్ననూ ఆమె యోని బూక్షము (చిటికెన వేలు కూడ దూరబడదు). ఆమెకి నా సమస్య తెలియదు. నేనొక గొప్ప కామకోవిదుడ ననుకొనుచున్నది.**

**ఇట్లు మైథునము తప్ప మిగతా రతి అంతయు జరుపుటవల్ల నష్టముండునా? వీర్య నష్టము మంచిది కాదని ఆయుర్వేదాది శాస్త్రములు చెప్పుచున్ననూ దానివల్ల ఏ హాని కలగదని మీరు చెప్పిన మాటను నమ్ముచున్నాను. హాని లేదు కదా? TV లో శృంగార దృశ్యములు చూడవచ్చునా?**

**నాకు హై బి.పి. ఉన్నది. డాక్టరు గారు ఒకవేపు స్తంభనము కలుగు మందులు, మరొక వేపు హై బి.పి.కి మందులు యిచ్చుచుంటిరి. ఒకటి స్తంభనము పోగొట్టును. ఒకటి స్తంభనలు కలిగించును. కావున నన్ను నేను ఎట్లు కాపాడుకొనేది? స్తంభనమునకు డాక్టరిచ్చిన మందు వాడుతూ, Aten మాత్రలు వేసుకోనా? Aten నాకు అలవాటే!**

**-నిడదవోలు**

జ. వయసుని జయించి మీరూ, మీ భార్య కామజీవితాన్ని చక్కగా ఆనందిస్తున్నందుకు మా హృదయ పూర్వకంగా హర్షిస్తున్నాము. మీ తరాన్ని దృష్టిలో ఉంచుకుంటే మీ శ్రీమతి మీకు అందిస్తున్న సహకారం మరీ అభినందనీయం, మీ సమకాలీనులకి ఆదర్శవంతం కూడా!

ఒక వయసు దాటేక- అనగా పెద్ద వయసులో- శృంగార చేష్టలతో ఉన్న సుఖ సంతోషాలు కేవల రతిలో లభించవు. లభిస్తే మంచిదే! కాని రతీ, భావప్రాప్తీ లేకపోయినా కేవల శృంగార చర్యలతోనే కూడా కామ సంతృప్తి ఈ వయసులో లభించగలదు. అంతకు మించి మీ ఇద్దరి మధ్యా రాను రాను సాన్నిహిత్యాన్ని పెంచే సాధనం సెక్సు. కనుకనే అంగ స్తంభనం సహకరించకపోయినా మీరు, మీ భార్య కూడా శృంగారాన్ని ఆనందించగలుగుతున్నారు. మీ భార్య కూడా మీకు అంగం సరిగా స్తంభించటం లేదని తెలియని అమాయకు రాలనుకోను. అన్నీ తెలిసీ ఏమీ తెలియని దానిలా ఆమె అభినయిస్తున్నారో, లేక ఆమె మీ నుంచి పొందుతున్న ఆనందానికి శిశ్నంతో పనిలేదో- ఏదైనా ఆమె మీకిచ్చే కితాబు వాస్తవమే అనుకోండి.

ఇక ఆమె యోని ద్వారం యిరుకు గురించి అంటారా? 65 సం॥ల స్త్రీ- ముఖ్యంగా రతికి దూరమైతే ఆమె యోనిద్వారం యిట్టే యిరుకవుతుంది. ఒకే వయసుగల ఇద్దరు ముట్లుడిగిన స్త్రీలను పోలిస్తే రతిలో రెగ్యులర్‌గా పాల్గొనే ఆమె యోని ద్వారమూ, బీజవాహికా- ఆరోగ్యంగా రతికి అనుకూలంగా ఉంటాయి. రతిలో అడపాదడపా పాల్గొనే స్త్రీకీ, అసలే పాల్గొనని స్త్రీకీ యోని టిష్యూలు పొడారి, ముడుచుకుపోయి వేలుకూడా దూరనంత యిరుకైపోతాయి. దీనికి ఎస్ట్రోజైన్ హార్మోను లోపం ఒక కారణమైతే "వాడుకోకపోవడం (disuse)" మరో ముఖ్య కారణం. అందుకే మాస్టర్స్, జాన్సన్‌లు "Use it, or lose it" అన్నారు. ఎస్ట్రోజెన్ హార్మోను చికిత్సద్వారా మరల యోని టిష్యూలను ఆరోగ్యవంతంగా, రతి యోగ్యంగా మార్చే అవకాశం లేకపోలేదు గాని ఈ వయసులో మేము హార్మోను చికిత్స సూచించము. ఏది ఏమైనా ఈ విషయంలో మీరు హార్మోను నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం.

ఒకపోతే వీర్యనష్టం అనే పదాన్ని మేము అంగీకరించము. దాని వల్ల నష్టం ఏమీ లేదుగాక లేదు అనేది నిజం.

TVలో శృంగార దృశ్యాలు చూడవచ్చా అని అడిగేరు. ఎందుకు చూడకూడదో చెప్పండి. యవ్వన ప్రాదుర్భావంలో వున్న యువతీ యువకులకైతే అవి హృదయాలని కలవరపరచి వాళ్ళని తప్పుదోవ పట్టించే రిస్కు ఉండగా- నడి వయస్కులు, ఆపైబడిన వారిలో అవి కామోద్దీపకౌషధాలుగా పనిచేస్తాయి. కనుక పెద్దల కది ఆమోద యోగ్యమే!

Hypertension (HBP) మాత్రలు స్వంతంగా మార్చుకోకండి. అన్ని బి.పి. మాత్రల వల్ల సెక్సువల్ సైడ్ ఎఫెక్ట్సు ఉండవు. వాటితోపాటు బి.పి.ని ప్రభావితం చెయ్యని కామవర్ధకౌషధాలతో కలిపి వేసుకోవచ్చు. కాని నిజమైన కామవర్ధకౌషధాలు లేవు. వయాగ్రా లాంటి స్తంభన ఔషధాలకి బి.పి.ని తగ్గించే గుణం ఉంది కాబట్టి వయాగ్రాతో పాటు బి.పి. బిళ్ళలు వేసుకుంటే అది డాక్టరు నిర్ణయించిన సమయంలో, ఆయన చెప్పే డోస్ ప్రకారమే వాడాలి. ముఖ్యంగా మీకు Aten అలవాటనీ, దానివల్ల మీరు సెక్సువల్ సైడ్ ఎఫెక్ట్సు లేవు గనుక వీలైనంత వరకూ ఆ మందునే సూచించమనీ డాక్టర్ని మీరు కోరవచ్చు.

## అపక్రమ బహిష్టులు పెళ్ళయితే సర్దుకుంటాయా?

**నాకు 20 సం॥లు. ఇంకా పెళ్ళి కాలేదు. నాకు మంత్లీ పీరియడ్స్ నెల నెలా రావు. 2-3 నెలలకి ఒకసారి వస్తాయి. ఒకొక్కసారి యింకా ఎక్కువ టైం కూడా పడుతుంది. డాక్టరు దగ్గరకు వెడితే టాబ్లెట్లు యిచ్చారు. అవి వాడినన్నాళ్ళూ సరిగా నెలకు పీరియడ్స్ వచ్చేవి. మానేసేక మళ్ళీ మామూలే. డాక్టర్నడిగితే పెళ్ళయ్యే వరకు కొందరికి అలానే అవుతాయన్నారు. బహిష్టు రెగ్యులర్‌గా అవకపోతే ఆరోగ్యం పాడవుతుందా?**

**-కడప**

జ. ఆడపిల్లలకి రజస్వలయిన కొత్తలో 1-2 సం॥ల పాటు బహిష్టు అపక్రమం ఉంటుంది. అటుపై రెగ్యులర్ అయిపోతుంది. అంతేకాని పెళ్ళి అయ్యేవరకు అపక్రమం ఉంటుందను కోవడం కరెక్టు కాదు. ఆ మాట మీకు క్వాలిఫైడ్ డాక్టర్లెవరూ చెప్పరు.

మాత్రలు వాడితే నెల నెలా కరెక్టుగా బహిష్టవుతోందన్నారు కాబట్టి మీ గర్భాశయం అభివృద్ధి, పనితీరు నార్మల్‌గా ఉన్నాయని అర్థం. దాన్ని సక్రమంగా పనిచేయించి బహిష్టులు రప్పించే హార్మోనుల్లో చిన్న లోటుపాట్లున్నాయి. గైనకాలజిస్టు (M.D)చే హార్మోను పరీక్షలు, ఇతర పరీక్షలు చేయించుకుని సరైన మందులు వాడితే సమస్య తీరిపోతుంది.

## మాత్రలు వాడితే గర్భం ఎప్పటికీ రాదా?

**నేను గర్భం రాకుండా ఉండేందుకు నాలుగు సంవత్సరాల పాటు ఓవ్రాల్ మాత్రలు వాడాను. మాత్రలు మానేసి 3 నెలలయింది. ఇంతవరకూ బహిష్టు రాలేదు. మొదట గర్భమేమో అనుకుని చాలా సంతోషించాము. టెస్టులేమి చేయించినా గర్భం లేదని తేలింది. మాత్రలు వాడి తప్పు చేసామేమో అని బాధపడుతున్నాము. బహిష్టులు ఆగిపోయినవా? సంతానం కోసం మేము ఏమి చెయ్యాలి? నా వయసు 25. మా వారి వయసు 29.**

**-సి.యస్., పార్వతీపురం.**

జ. గర్భ నిరోధక మాత్రలు 4 సం॥లు వాడటం పెద్ద దీర్ఘకాలమేమీ కాదమ్మా! ఆందోళన పడకండి. మాత్రలు వాడినందు వల్ల మీలో ఇంతకు ముసుపు ఉన్న గర్భధారణశక్తి ఏమీ దెబ్బతినదు. ఇలా 2-3 సం॥లు ఏకధాటిగా హార్మోను మాత్రలు వాడిన వారిలో నూటికి 25 మందిలో గర్భం రావడానికి ఏడాది పడుతుంది. 10% మందికి రెండేళ్ళు కూడా పట్టొచ్చు. కనుక 3 నెలలయినా మీకు గర్భం రాకపోవటం ఆశ్చర్యమేమీ కాదు. బహిష్టు ఆగిపోవటం లాంటి పరిణామాలు కూడా అడపా తడపా కనిపిస్తాయి.

అయితే బహిష్టు ఆగిపోవడానికి లెక్కలేనన్ని యితర కారణాలున్నాయి. కనుక మీరొకసారి గైనికాలజిస్టుకి చూపించుకోండి. మీ వైద్య చరిత్ర, మామూలు ఆరోగ్యం, రక్తంలోని హార్మోనుల స్థాయి... వీటిని పరిశీలించి చికిత్స చేస్తారు.

మాత్రలు వాడక పూర్వం మీకు బహిష్టులో అపక్రమం ఏమైనా ఉండేదా? అప్పుడుంటే ఇప్పుడు కూడా ఆ పరిస్థితే కొనసాగుతోందని భావించాలి. ★


**Dr. DVR Poosha,** Ph.d

Editor : Abhisarika

Consultant : Psychosexual Medicine

40 Indl. Estate

SAMALKOT A.P. - 533 440

India

Ph: +91-884-2327454

Fax : 2327965

email: question@sexualcounselling.com